
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 14 అక్టోబరు 2025



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

కరుణించమ్మా..

- వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాల జాతర

బుక్కరాయసముద్రం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కొలువైన పెద్దమ్మ తల్లి బోనాల జాతర సోమవారం కన్నుల పండువగా జరిగింది. భక్తుల అమ్మవారి నామస్మరణతో బుక్కరాయసముద్రం మార్మోగింది. ప్రతి ఇంటి నుంచి మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జాతర చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం కోసం ప్రాణ త్యాగంచేసిన మునలమ్మ కుటుంబ సభ్యులు తిరుమలరెడ్డి, రామిరెడ్డి వంశస్థులైన సూర్యనారాయణ రెడ్డి, సుశీల దంపతులు.. అమ్మవారికి మొదటి బోనం సమర్పించి, పూజ నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి బోనాలు మోస్తూ... డప్పు శబ్దాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

7లో.. | సదరం క్యాంపు వాయిదా: కలెక్టర్ | హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు | దొడ్డిదారి బదిలీలపై ఆశలు



నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాలలో కొత్తటీచర్లతో ఎమ్మెల్యే దగ్గుపాటి



కళ్యాణదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్‌లో తొలి హాజరు వేస్తున్న కొత్త టీచర్లు

బడిలో సంబరాలు

కొత్త టీచర్ల సందడి... 747 మంది జాయిన్

అనంతపురం విద్య/ క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో కొత్త టీచర్లు సంబరాలు చేసుకున్నారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన 748 మంది నియామకం పొందారు. వారిలో 747 మంది మంగళవారం విధుల్లో చేరారు. దీంతో పాఠశాలల్లో సందడి కనిపించింది. పదిహేనేళ్ల తరువాత డీఎస్సీ నిర్వహించడం, ఉద్యోగాలు పొందడం పట్ల కొత్త టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తొలిరోజు ఆనందంగా తమకు కేటాయించిన పాఠశాలలకు చేరుకున్నారు. పాఠశాలల వద్ద పాత టీచర్లు, హెచ్‌ఎంలు.. కొత్తవారికి స్వాగతం పలికారు. ఆ తర్వాత కేటాయించిన పాఠశాలల వద్ద తొలిసారిగా ముఖహాజరు నమోదు చేస్తూ సంతోషంలో మునిగిపోయారు. అనంతపురంలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాలలో కొత్తగా చేరిన టీచర్లను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సత్కరించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆన్‌లైన్‌లో హాజరు వేసిన వెంటనే ఏయే టీచర్ ఏయే పాఠశాలలో జాయిన్ అయ్యారో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. వారికి సలహాలు ఇచ్చారు. మొత్తంమీద తొలిరోజు 747 మంది కొత్తటీచర్లు జాయిన్ అయ్యారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

ప్రభుత్వాలు సిగ్గు పడాలి

- కేంద్రం విధానాలను ప్రశ్నించలేని ఏపీ, బిహార్ సీఎంలు
- ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే
- సనాతనం పేరుతో హక్కులపై కుట్ర: శ్రీమతి టీచర్
- అనంతలో ఐద్వా రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న మరియం ధావలే

అనంతపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పురుషులతో మహిళలకు సమాన హక్కులు కల్పించలేని ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని ఐద్వా అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలకు సోమవారం అనంతపురంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ కూడలి మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వేలాది మంది మహిళలు ఐద్వా జెండాలు, ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. 16వ మహాసభల సూచికగా 16 పెద్ద జెండాలతో కార్యకర్తలు ఉరుము కళాకారుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనల నడుమ కదిలారు. అనంతరం లలితకళా పరిషత్‌లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన సభను (మిగతా 6లో...)

అందీ.. అందని బిల్లులు..!

మంజూరు చేసిన ప్రభుత్వం

ఎం.బుక్కులు లేక రైతుల ఖాతాకు జమకాని సొమ్ము

415 మందికి తప్పని ఎదురుచూపులు



కొరివిపల్లి వద్ద సాగుచేసిన పండ్ల తోట

శింగనమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రావనుకున్న బిల్లులు మంజూరైనా ఆ రైతులకు మాత్రం అందకుండా ఉన్నాయి. ప్రభుత్వం పాత పెండింగ్ బిల్లులు మంజూరు చేసినా రెండు శాఖల సమన్వయ లోపంతో మండల రైతులకు ఈ పరిస్థితి కలిగింది. గత టీడీపీ పాలనలో పండ్ల తోటలు సాగు చేసిన రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఐకేపీ, ఉపాధి హామీ శాఖల మధ్య సమన్వయం కొరవడటం వారికి శాపంగా మారింది. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసిన 415మంది రైతులకు 2018-19 సంవత్సరాలకు సంబంధించి రూ.21,52,245 బిల్లులు ఆగిపోయాయి. వీరికి వైసీపీ ప్రభుత్వంలో పైసా బిల్లులు రాలేదు. గత ఏడాది కొలువు దీరిన కూటమి ప్రభుత్వం పాత పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ఆమోదం తెలిపింది. దీంతో పెండింగ్ పడిన పండ్ల తోటల బిల్లుల వివరాలను మండల సమాఖ్య అధికారులు ఉపాధి హామీ సిబ్బందికి ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే తమ వద్ద ఎంబుక్‌లు లేవని ఐకేపీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఏ రైతుకు ఎంత మొత్తం చెల్లించాలో తెలియకుండా పోయింది. వివరాలు లేకపోవడంతో పెండింగ్ బిల్లుల సొమ్మురూ.21,52,245ను ఉపాధి హామీ పథకం పీడీ ఖాతాకు జమ చేసినట్లు సమాచారం. దీంతో తమకు బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

వివరాలు సక్రమంగా లేవు: ఈశ్వరయ్య, ఏపీఎం

గతంలో పెండింగ్ బిల్లులు రైతుల వివరాలు మాత్రం ఉన్నాయి. రైతులకు ఎంత వరకు బిల్లులు చేశామనే ఎంబుక్‌లు లేవు. ఒకరిద్దరు రైతులకు రావాల్సిన బిల్లులు వివరాలు మాత్రమే ఉన్నాయి. అందుకే ఆ ఏడాదికి సంబంధించిన బిల్లులు పెండింగ్ మొత్తం పంచాయతీ వెండర్ ఖాతా ద్వారా రైతుకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశాం. ఎంపీడీఓ ఒప్పుకోకపోవడంతో సమస్యను ఉపాధి హామీ అధికారులకే వదిలేశాం.

వెండర్ ఖాతాతో సమస్యలు: భాస్కర్, ఎంపీడీఓ

పండ్ల తోటల బిల్లుల పెండింగ్ వివరాలు, రైతుల ఎంబుక్‌లో ఎంత బిల్లు పెండింగ్ ఉందనే వివరాలు ఇవ్వాలని మండల సమాఖ్య ఎంపీఎంను కోరాం. వారి వద్ద రికార్డులు లేవని సమాఖ్య అధికారులు చెతులు ఎత్తేశారు. వెండర్ ఖాతా ద్వారా రైతుల పెండింగ్ బిల్లులు చెలిస్తే సమస్య వస్తుంది. అందుకని పెండింగ్ బిల్లు మొత్తం పీడీ ఖాతాకు జమ చేశాం. రైతులు వివరాలతో వస్తే ఆ రైతుకు పీడీ ఖాతా నుంచి డబ్బు జమ చేస్తాం.

పీజీ డీలా..!

ఎస్కేయూలో భర్తీకాని సీట్లు

- తొలివిడత 328 సీట్లకు 213 భర్తీ
- రెండో విడత 281 సీట్ల కేటాయింపు
- తొలిరోజు 20 అడ్మిషన్‌లు మాత్రమే..
- పాతికశాతం నిండటమూ కష్టమేనా..?



మొదటి విడతలో విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న వర్సిటీ పాలకులు



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ముఖ ద్వారం

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పీజీ అడ్మిషన్‌ల విషయంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తిరోగమనంలో పయనిస్తోంది. ఒకప్పుడు వర్సిటీలో సీట్ల కోసం గట్టిపోటీ ఉండేదీ. లోకల్, నాన్ లోకల్ కోటా కింద ఉమ్మడి రాష్ట్ర విద్యార్థులు వర్సిటీలో చదివేందుకు ఎగబడేవారు. కానీ ఇప్పుడు పాతికశాతం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. వర్సిటీలో 33 విభాగాలు ఉన్నాయి. ఇందులో 18 సైన్స్ విభాగాల్లో 454, ఆర్ట్స్ గ్రూపుల్లో 610 కలిపి.. 1,064 సీట్లు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరానికి ఇటీవల సీట్ల భర్తీ ప్రక్రియ మొదలైంది. మొదఇ విడత 328 సీట్లు వర్సిటీకి అలాట్ అయ్యాయి. గత నెల చివరి వారంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. ఇందులో సైన్స్ గ్రూపుల్లో 157, ఆర్ట్స్ గ్రూపుల్లో 56మంది చేరారు. కేటాయించిన సీట్లలో 213 మాత్రమే భర్తీ అయ్యాయి. అంటే వర్సిటీలో ఉన్న సీట్లలో పాతిక శాతం కూడా భర్తీ కాలేదు. భర్తీ అయిన వాటిలో కెమిస్ట్రీ 29, అప్లైయిడ్ మ్యాథమ్యాటిక్స్ 3, మ్యాథమ్యాటిక్స్ 5, బయోకెమిస్ట్రీ 11, బయో టెక్నాలజీ 12, బాటనీ 9, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రూమెంటేషన్ 4, జాగ్రఫీ 3, మైక్రోబయాలజీ 12, ఫిజిక్స్ 6, సెరికల్చర్ 6, స్టాటిస్టిక్స్ 4, జువాలజీ 12, ఫిజికల్ ఎడ్యుకేషన్ 5, ఆర్గానిక్ కెమిస్ట్రీ 15, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ 19, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పాలిమర్‌సైన్స్ ఒక్కొక్కటి ఉన్నాయి.

రెండో విడత ప్రారంభం

వర్సిటీలో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. మొత్తం 281 సీట్లు అలాట్ అయ్యాయి. ఇందులో రెగ్యులర్ 201, సెల్ఫ్ ఫైనాన్స్ 52, పేమెంట్ సీట్లు 28 ఉన్నాయి. రెగ్యులర్‌లో ఇంగ్లీష్ 6, అడల్ట్‌ఎడ్యుకేష్, రూరల్ డెవలప్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లైయిడ్ ఎకనామిక్స్ పాలిమర్ సైన్స్ ఒక్కొక్కటి, తెలుగు 6, హిందీ 2, సోషల్ వర్కర్ 3, లైబ్రరీ 6, హిస్టరీ 7, పొలిటికల్ సైన్స్ 18, ఎకనామిక్స్ 4, కామర్స్ 14, బయోకెమిస్ట్రీ 12, బయోటెక్నాలజీ 13, మైక్రోబయాలజీ 12, బాటనీ 12, సెరికల్చర్ 5, జువాలజీ 12, అప్లైయిడ్ మ్యాథమ్యాటిక్స్ 3, మ్యాథమ్యాటిక్స్ 6, స్టాటిస్టిక్స్ 5, ఫిజిక్స్ 7, కెమిస్ట్రీ 33, జాగ్రఫీ 6, ఇన్స్ట్రుమెంటేషన్ 4 ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో కామర్స్ 3, ఫిజికల్ ఎడ్యుకేషన్ 6, ఎలక్ట్రానిక్స్ 2, ఆర్గానిక్ కెమిస్ట్రీ 21, కంప్యూటర్ సైన్స్ 20, పేమెంట్ సీట్లలో తెలుగు ఒకటి, బయోకెమిస్ట్రీ 2, బయో టెక్నాలజీ 10, మైక్రో బయాలజీ 4, బాటనీ 3, జువాలజీ 8 కేటాయించారు. కొన్నింటికి అలాంట్ మెంట్ లేదు. కేటాయించిన సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అవడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. రెండో విడత తొలిరోజు ఆర్ట్స్ విభాగంలో నలుగురు, సైన్స్ విభాగాలలో 16 మంది అడ్మిషన్ పొందారు.

కారణాలెన్నో..

సైన్స్ కోర్సులో ప్రవేశాలు కాస్త ఊరటనిస్తున్నా, ఆర్ట్స్ కోర్సులలో సీట్ల భర్తీ అధ్వానంగా మారింది. గత ఏడాది సైన్స్‌లో 454 సీట్లకు 206 సీట్లు భర్తీ అయ్యాయి. ఆర్ట్స్‌లో 610 సీట్లు ఉండగా, కేవలం 90 భర్తీ అయ్యాయి. ఈ కోర్సులలో వర్సిటీ ప్రారంభం నుంచి ఏలాంటి మార్పులు లేవు. ఇదే సీట్ల భర్తీపై ప్రభావం చూపుతోందన్న వాదనలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి సంప్రాదాయ కోర్సులు ఉండటంతో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. ఉన్న కోర్సులకు టెక్నికల్, ఉపాధి అవకాశాలు లభించే కోర్సులనను జోడిస్తే సీట్ల భర్తీ పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. దీనికితోడు ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్ పొందేవారే కరువయ్యారు. ఉన్నవారిలో డిగ్రీ పూర్తి అయిన వెంటనే ఉద్యోగ అవకాశాల కోసం పరుగులు తీస్తున్నారు. చాలా ప్రైవేట్ కంపెనీలు డిగ్రీ ప్రాతిపదికనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ క్రమంలో పీజీకి మరో రెండేళ్లు ఎందుకనే భావనతో చేరడం లేదు. మరికొందరు ఇంటర్ అవ్వగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరితగతి దక్కే కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ కోర్సులవైపు వెళుతున్నారు. ఇది కూడా పీజీ కోర్సులపై ప్రభావం చూపుతోంది. దీనికితోడు ఒక పీజీ చేసిన వారికి వర్సిటీలో రెండో పేజీ చేసేందుకు అవకాశం ఉన్నా, వసతి కల్పించడం లేదు.

ఇది మేలు చేసే ప్రభుత్వం

హామీ ఇవ్వకున్నా జీఎస్టీని తగ్గించాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంటే.. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా భారీగా స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద ఎమ్మెల్యే దగ్గుపాటి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు జీఎస్టీ తగ్గిస్తామని కూటమి హామీ ఇవ్వలేదన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ప్రధాని మోదీ నిర్ణయానికి సీఎం చంద్రబాబు మద్దతు పలికారని అన్నారు. జీఎస్టీ తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై కూడా రూ.8 వేల కోట్ల భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, కార్మికశాఖ డీసీ లక్ష్మీనరసయ్య, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పావని, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ కార్యదర్శి రంగారెడ్డి, కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహ, పీఎల్ఎన్ మూర్తి, బొమ్మినేని శివ, ఇమామ్ హుస్సేన్, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, రాజారావు, బాలకృష్ణ, ఫిరోజ్ అహ్మద్, తేజస్విని, భవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దారి చూపరూ..

పొలానికి దారిలేక.. పంట అమ్ముకోలేకున్నాం..

కలెక్టర్‌కు బొప్పాయి రైతు వినతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బొప్పాయి పంట పండించినా.. దారిలేక అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నానని ఓ రైతు.. కలెక్టర్ ఆనంద్‌కు విన్నవించుకున్నాడు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన రైతు సుధాకర్.. కలెక్టర్‌కు అర్జీ అందజేశాడు. సర్వే నంబరు 671లో వ్యవసాయ భూమి దారి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం 10 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉందనీ, రూ.15లక్షలు పెట్టుబడి పెట్టానన్నారు. ప్రస్తుతం కోత దశలో ఉందనీ, ఈ స్థితిలో కొందరు దారి మూసేశారని తెలిపారు. 25రోజులనుంచి బొప్పాయి కోత వేయలేకపోతున్నాననీ, కాయలు పండుగా మారి కింద పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులపాలయ్యే పరిస్థితి ఉందనీ, దారి చూపాలని కోరాడు. గతనెల 8న కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చాననీ, తహసీల్దార్, కళ్యాణదుర్గం ఆర్డీఓను కూడా కలిశానన్నారు. ఈనెల 4న కంబదూరు మండల, గ్రామ సర్వేయర్లు మాత్రమే పొలానికి వచ్చారనీ, అయినా దారి లేదని చెప్పారన్నాడు. తమ కుటుంబం వందేళ్లుగా అదే దారిలో నడుస్తోందన్నాడు. తహసీల్దార్ ఫోన్‌లో మాట్లాడి, పరిశీలిస్తున్నామని చెప్పి, వెంటనే పరిష్కారమైనట్లు తనకు మెసేజ్ రూపంలో సమాచారం వచ్చిందన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రజల నుంచి మొత్తం 422 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు డీఆర్వో మలోల తదితరులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఆయాశాఖల పరిధిలో పెండింగ్ లేకుండా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో 2 నుంచి 3 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

ధర్మవరం బాలికలు భళా..!

ఫ్లోర్‌బాల్ అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

నవంబరులో సింగపూర్‌కు విద్యార్థినులు

మున్సిపల్ పాఠశాల బాలికలకు ఆర్థిక కష్టాలు



సింగపూర్‌లో నిర్వహించే పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థినులు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ధర్మవరం బాలికలు. అరకొరగా ఉన్న సౌకర్యాలనే అందిపుచ్చుకు అద్భుత ప్రతిభా పాటవాలు కనబరుస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఫ్లోర్‌బాల్ క్రీడల్లో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మొదట రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించి.. అక్కడ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తాచాటి ఏకంగా సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు జాతీయ జట్టులో 10 మంది చోటు సంపాదించుకున్నారు.

ఇదీ ఫ్లోర్‌బాల్ క్రీడా నేపథ్యం..

ఫ్లోర్‌బాల్ క్రీడలో మొత్తం 11 మంది ఉంటారు. క్రీడలో ఆడేవారు ఆరుగురు ఉండగా.. మిగిలిన ఐదుగురు అదనంగా ఉంటారు. ఈ ఆటకు 30 నిమిషాలు కేటాయిస్తారు. ఇందులో ఎక్కువ గోల్స్ చేసిన జట్టును విజేతగా నిర్ణయిస్తారు. ఈ క్రీడ ఇండోర్ స్టేడియంలో ఆడతారు.

అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ

ఈ క్రీడకు ధర్మవరం ప్రాంతంలో పెద్దగా ప్రాధాన్యం లేదు. కొన్ని నెలల నుంచి ఈ క్రీడకు బీఎస్ఆర్ మున్సిపల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాధాన్యం ఇచ్చి బాలికలను ప్రోత్సహించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలతోనే శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం, పీఈటీ, పీడీలు ప్రత్యేక దృష్టి సారించి బాలికలకు ప్రతిరోజూ ఫ్లోర్‌బాల్ ఆటలో మెలకువలు నేర్పించారు. దీంతో మూడునెలల కాలంలోనే బాలికలు మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆగస్టు మొదటి వారంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ధర్మవరానికి చెందిన 20 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తర్వాత గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సత్తాచాటి.. జాతీయస్థాయి పోటీలకు 13 మంది ఎంపికయ్యారు. వీరు బిహార్‌లో సెప్టెంబరు 1నుంచి 10వతేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో కూడా సత్తాచాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున 10 మంది ఎంపికయ్యారు. వీరు నవంబరులో సింగపూర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారు. సింగపూర్‌కు వెళ్లడానికి ఒక్కో బాలికకు రూ.2లక్షల దాకా ఖర్చు అవుతుంది. ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ తరపున రూ.50వేలు ఇస్తారు. మిగిలిన మొత్తం తల్లిదండ్రులు లేదా దాతల సహకారంతో డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మున్సిపల్ స్కూలులో చదువుతున్న ఈ చిన్నారులకు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. పాస్‌పోర్టు కోసం ఈనెల 30,31తేదీలలో బాలికలు విజయవాడ వెళ్లనున్నారు. నవంబరు మొదటి వారంలో 10 రోజుల పాటు ఢిల్లీలో ఫ్లోర్‌బాల్ క్రీడలో శిక్షణకు వెళ్లనున్నట్టు పీఈటీ తెలిపారు.

పీఈటీ కృషి ఎనలేనిది

ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ కనుముక్కల లక్ష్మీనారాయణ బాలికల విజయానికి చేసిన కృషి ఎనలేనిది. ఆయన తాడిపత్రి నుంచి బదిలీపై జూన్‌లో ధర్మవరం వచ్చారు. ఫ్లోర్‌బాల్‌పై బాలికలకు ఉన్న మక్కువ చూసి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా క్రీడను ఎలా ఆడాలో చూపించి శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో ఈ క్రీడకు కావాల్సిన ఆట వస్తువులు లేవు. దీంతో పీఈటీ తన సొంత ఖర్చులతో బ్యాట్లు, బాల్లు ఇతర వస్తువులను కొనుగోలు చేసి శిక్షణ ఇచ్చారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణిస్తారు



నేను ఈ ఏడాది జూన్‌లో సాధారణ బదిలీల్లో తాడిపత్రి నుంచి ధర్మవరం పీఈటీగా వచ్చా. విద్యార్థినిలకు ఏ క్రీడలపై మక్కువ ఉందో తెలుసుకున్నా. పాఠశాలలో ఐపీబీ ప్యానల్ ద్వారా ఫ్లోర్‌బాల్ క్రీడ ఎలా ఆడాలో చూపించి క్రీడా సామాగ్రిని సమకూర్చి నేర్పించా. దీంతో నేరుగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లా. అక్కడ ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున మా పాఠశాల నుంచే 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. అంతర్జాతీయ పోటీల్లో కూడా సత్తాచాటి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నా.

-కనుముక్కల లక్ష్మీనారాయణ, పీఈటీ, బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ధర్మవరం

అంతర్జాతీయ పతకమే లక్ష్యం



నేను 9వ తరగతి చదువుతున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడ టీవీల్లో చూడమే కానీ ఎప్పుడూ ఆడలేదు. ఈ ఏడాది మా పాఠశాలకు బదిలీపై వచ్చిన పీఈటీ లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో తక్కువ కాలంలో ఫ్లోర్‌బాల్ ఆట నేర్చుకున్నా. సింగపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకం సాధించడమే నా లక్ష్యం.

-బండారు కీర్తన, 9వ తరగతి

ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే ఇష్టం



ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే చాలా ఇష్టం. పాఠశాలలో ఇంతకు ముందెన్నడూ ఆడలేదు. ప్రస్తుతం ఐపీబీ ప్యానల్ ద్వారా పీఈటీ లక్ష్మీనారాయణ సార్ శిక్షణ ఇచ్చారు. నేరుగా ఆగస్టులో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటా. తరువాత బీహార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ సత్తాచాటి మా పాఠశాలకు పేరుప్రతిష్టలు తీసుకువస్తా.

-నందిని, 9వ తరగతి

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా



నేను 9వ తరగతి చదువుతూనే క్రీడలకు సమయాన్ని కేటాయిస్తున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించా. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. ఈ క్రీడలో పీఈటీ లక్ష్మీనారాయణ సార్ కృషి ఎంతో ఉంది. ఆయన సొంత ఖర్చులతో మాకు కావాల్సిన బ్యాట్లు, బాల్లు తదితర వాటిని సమకూర్చారు. ఆయన ఆశయం మేరకు అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణిస్తాం.

-గౌతమి, 9వ తరగతి

గ్రేడ్ల కుదింపుతో ఉద్యోగోన్నతులు

● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదు నుంచి నాలుగు గ్రేడ్లుగా కుదింపుతో పంచాయతీ కార్యదర్శులకు ఒకేసారి ఉద్యోగోన్నతి కల్పించే అవకాశం ఉంటుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పంచాయతీ గ్రేడ్ల కుదింపుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల కోరిక మేరకు నాలుగు గ్రేడ్లుగా కుదించారని, దీనివల్ల పాలన సౌలభ్యం కలగడంతోపాటు ఉద్యోగోన్నతులు కూడా త్వరగా వస్తాయన్నారు. పెనుకొండ, పరిగి మండలాలకు చెందిన పలువురికి మంత్రి సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సూరి, గిరి, నాగార్జున, నారాయణస్వామి పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

మంత్రి సవిత సమక్షంలో ఎనిమిది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాకప్పి ఆహ్వానించారు. వీరంతా పరిగి మండలం పి.నర్సాపురం పంచాయతీలోని ఎస్.కొత్తపల్లి, బీరేపల్లి గ్రామాలకు చెందిన వారు.

అర్చక సమస్యల పరిష్కారానికి కృషి

దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి

ఏపీ అర్చక సమాఖ్య జిల్లా కమిటీ ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్చకుల సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ కల్యాణ మండపంలో ఏపీ అర్చక సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ... పలువురు అర్చకులకు తల్లికి వందనం పడలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి తల్లికి వందనం వర్తించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం రూ.5వేలు ఉన్న డీడీఎన్ఎస్‌ను రూ.10వేలకు పెంచి అర్చక పురోహితుల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం ఏపీ అర్చక సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పుల్లమాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరాముడు, సహాయ కార్యదర్శులుగా తిమ్మరాజు, కడప మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా మారుతి, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, బాలాజి, పవన్‌కుమార్, గౌరవ సలహాదారులుగా అనిల్‌కుమార్, మహేష్‌శర్మ, మురళి, ఉసేనప్ప, రాము, పామిడి రాములతోపాటు మొత్తం 30 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎం పిక చేశారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షులు పూజా రి భీమప్ప, పార్థసారథి, గరుడాచార్యులు, ద్వారకానాథాచార్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా సత్వర న్యాయం చేయాలని ఎస్పీ సతీ్‌షకుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా భావించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ సమస్యలపై 75 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువులు రాకుండా కంచె

అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో ప్రమాదాలు

ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి



పవన్‌కుమార్ రెడ్డి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపైకి పశువులు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో పెనుప్రమాదాలు జరుగుతాయని వివరించారు. రైలు పట్టాలు తప్పే అవకాశం కూడా ఉండవచ్చు అన్నారు. సోమవారం అనంతపురం రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ప్రధానంగా పశువుల ట్రాక్‌పాస్ ద్వారా చాలా ప్రమాదం అన్నారు. రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాల్లో పచ్చిక ఉండటం, తినడానికి వచ్చిన ఆవులు, గేదెలు ప్రమాదవశాత్తూ మృత్యువాత చెందుతున్నాయన్నారు. ఈ మధ్య ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఆవులను, గేదెలను పాలు పిండుకున్న తరువాత మేతకోసం రైల్వే ట్రాక్ సమీప ప్రాంతాలకు తోలుతుండటంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొందని అన్నారు. రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటుతుండటంతో ప్రమాదవశాత్తు ఢీకొని మృతిచెందుతున్నాయన్నారు. ఇలాంటి సందర్భంలో రైలు పట్టాలు తప్పి ప్రమాదం చోటు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీంతో జిల్లా కేంద్ర పరిసర ప్రాంతాలైన రైల్వే స్టేషన్ నుంచి రాజీవ్ కాలనీ బ్రిడ్జి వరకు.. అటు ప్రసన్నాయపల్లి గేట్ వరకు జంతువులు ట్రాక్ వైపు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పశువుల యజమానులు ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో జంతువులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడటంతో పాటు రైల్వే నిబంధనల మేరకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కారం వెతకాలి

ప్రముఖ న్యాయవాది తీస్తా సైతెల్వాద్



సెమినార్‌లో మాట్లాడుతున్న తీస్తా సైతెల్వాద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలని ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ పేర్కొన్నారు. ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరమాసప్ప అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వీటికి పరిష్కారమార్గాలు ఏమిటన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కిందిస్థాయి కోర్టుల్లోనే పరిష్కారం కావాల్సిన చాలా కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు తీసుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. కోర్టుల్లో పని చేసే న్యాయవాదులనే జడ్జిలుగా ఎన్నుకోవడం ద్వారా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు బనాయించడం. చిన్న చిన్న కేసులకు సైతం బెయిల్ రాకుండా కాలయాపన చేస్తుండటం ప్రస్తుతం చూస్తున్నామన్నారు. న్యాయవ్యవస్థలో దళిత, గిరిజనులతో పాటు మహిళల భాగస్వామ్యం బాగా తగ్గిపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ఆల్‌ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్, పలువురు ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురంరూరల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 67టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నకిలీ మద్యం వేట

ములకలచెరువు వ్యవహారంతో ఎక్సైజ్ అధికారుల్లో కలవరం

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు

నకిలీ మద్యం తయారీపై నిఘా



కిరెకెరలోని మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఈఎస్

పుట్టపర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారం ఇటీవల వెలుగుచూడడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో నకిలీ మద్యం వేట మొదలెట్టారు. మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంతో జిల్లాకి సంబంధాలున్నాయా, తయారీలో ఎవరి పాత్రయినా ఉందా.. అన్న కోణాల్లో ఎక్సైజ్ అధికారులు బృందాలుగా ఏర్పడి, తనిఖీలు చేపడుతున్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయడంతో జిల్లాలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తంది. మద్యం దుకాణాల్లో మద్యం లేబుళ్లు, నిల్వలు, అమ్మకాలపై తనిఖీలు చేపడుతున్నారు. శాంపిళ్లు సేకరిస్తున్నారు. ప్రధానంగా ములకలచెరువు సమీప మండలాలైన కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట, అమడగూరు మండలాల్లో బార్లు, మద్యం దుకాణాలతోపాటు బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. కొన్ని బెల్ట్ దుకాణాల్లో చీప్ లిక్కర్‌ను బ్రాండెడ్ బాటిళ్లలో పోసి, విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు దారులున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. ఆరునెలల క్రితం హిందూపురంలో తొలిసారిగా నకిలీ మద్యం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. పదిరోజుల క్రితం ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ గుట్టు రట్టవడంతో జిల్లాపై ఎక్సైజ్ శాఖ రాష్ట్ర అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో తనిఖీలు విస్తృతంగా చేస్తున్నారు. జిల్లాలో 87 ప్రైవేటు, తొమ్మిది కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాలతో కలిసి 96 ఉన్నాయి. 11 బార్ అండ్ రెస్టారెంట్లను మంజూరు చేసింది. ఈసారి కొందరు రాజకీయ నాయకులు మద్యం వ్యాపారుల అవతారం ఎత్తారు. దీంతో ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వెనుక రాజకీయ మూలాలున్న నేపథ్యంలో జిల్లాలో ఖద్దరు పెత్తనంతో నడుస్తున్న వాటిలో నకిలీ మద్యం విక్రయిస్తున్నారా.. అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారను. గతంలో నకిలీ మద్యంతో పట్టుబడినవారి కదలికలపై నిఘా పెట్టారు. ఇటీవల తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన వడ్డే శ్రీరాములు మానసిక రుగ్మతతో బాధపడుతూ వీధుల్లో తిరుగుతూ మరణిస్తే.. మద్యం సేవించి చనిపోయినట్లు వైసీపీ ప్రచారం చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ లింకులు జిల్లాలో బయటపడకపోయినా విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. సమీప మండలాల్లోని మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, శాంపిళ్లు సేకరించాం. కర్ణాటక సరిహద్దుల్లోని చెక్‌పోస్టులతోపాటు మద్యం అమ్మకాలపై నిఘా పెట్టాం.

-గోవిందునాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్)

పత్తికి మద్దతు ధర: జేసీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ తెలిపారు. సోమవారం కర్నూలు పర్యటనలో ఉన్న జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... నోటిఫైడ్ చేసిన మార్కెట్ కమిటీలలో పత్తి కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు మధ్య రకం రూ.7,710, పొడవు పింజ రకం రూ.8,110 లభిస్తుందన్నారు. తేమ 8 శాతం లేక అంతకంటే తక్కువ నుంచి 12 శాతం వరకు మాత్రమే ఉండాలన్నారు. 8 శాతం నుంచి 12శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతానికి ఒక శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గింపు ఉంటుందన్నారు. 12 శాతం కంటే ఎక్కువ వచ్చిన పత్తిని కొనుగోలు చేయరని అన్నారు. రైతులు తప్పనిసరిగా వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్లతో అనుసంధానం చేసుకోవాలన్నారు. తాడిపత్రి మార్కెట్‌యార్డు కార్యదర్శి ఫోన్ నెంబర్-9182361482, గుత్తి మార్కెట్‌యార్డ్ కార్యదర్శి - 9182361475ను రైతులు సంప్రదించాలని సూచించారు. వీసీలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో వీసీలో మాట్లాడుతున్న జేసీ

ప్రభుత్వాలు సిగ్గుపడాలి



సంఘీభావం తెలుపుతున్న ఐద్వా మహిళలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సభకు మరియం ధావలేతోపాటు ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, కోశాధికారి పుణ్యవతి, సామాజికవేత్త తీస్తా సైతెల్వాద్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

కేంద్రం విధానాలను ప్రశ్నించలేని సీఎంలు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ తమ మద్దతుతో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, వారి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించలేని స్థితిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీ్‌షకుమార్ ఉన్నారని విమర్శించారు. ఆహార భద్రత, ఉపాధి భద్రతకు నిధుల కోసం కేంద్రాన్ని గట్టిగా అడగలేని స్థితిలో వారిద్దరూ ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి నిధులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం తీస్తా సైతెల్వాద్ మాట్లాడుతూ మహిళా హక్కులను హరిస్తున్న తాలిబన్ ప్రభుత్వాన్ని ఇక్కడికి ఆహ్వానించి, మీడియా సమావేశంలో కూడా మహిళా జర్నలిస్టులకు అవకాశం లేకుండా చేయడం సిగ్గు చేటన్నారు. కార్పొరేట్ చేతుల్లోఉన్న సోషల్ మీడియా ప్రజల మధ్య విద్వేషాన్ని రగిల్చే సాధనంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

76 ఏళ్ల తర్వాత కూడా పోరాటమే

ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా సమానత్వం కోసం మహిళలు పోరాడాల్సిన పరిస్థితులు దేశంలో ఉండటం విచారకరమన్నారు. సనాతనం పేరుతో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మహిళల హక్కులను హరించే పద్ధతులు అవలంబిస్తున్నాయన్నారు. సమానత్వం, మహిళా హక్కుల కోసం ఐద్వా సాగిస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉద్యమాలకే కాకుండా సామాజిక పురోగతికి పెట్టింది పేరన్నారు. ఐద్వా తొలి మహాసభలోనూ అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులు హాజరయ్యారని ఆమె గుర్తుచేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనువాద విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు పద్మావతి, వీకే పద్మ, లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, డాక్టర్ ప్రసూన, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

సమాజాన్ని కాపాడుకోవాలి

సామాజికవేత్త తీస్తా సైతెల్వాద్

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): వామపక్షాలు, దళిత సంఘాలు, అభ్యుదయవాదులు బాధ్యతగా మెలిగి ఫ్రొటోఫాసిస్టు ప్రభుత్వం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలని, అందుకోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని సామాజికవేత్త తీస్తా సైతెల్వాద్ అన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అనంతపురంలోని క్వామేడ్ రబియాబీ ప్రాంగణంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. లలితకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షత వహించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు వడ్డుపల్లి నాగమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో తీస్తా సైతెల్వాద్ మాట్లాడుతూ, దేశంలో ప్రజా స్వేచ్ఛ, హక్కులపై దాడి జరుగుతోందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేని బీజేపీ నేడు దేశంలో పాలన సాగిస్తోందని అన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టాలను తీసుకువచ్చి పౌరహక్కులను హరిస్తోందని విమర్శించారు. అస్సాం, బెంగాల్, మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులు వర్ణనాతీతం అని అన్నారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, మితవాదంవైపు ప్రయాణం చేస్తోందని అన్నారు. వాట్సాప్ ఫ్యాక్టరీ సమాజంలో పెనుప్రమాదం సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ, మతోన్మాద ప్రచారాలు మన కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలను మళ్లీ బ్రిటీష్ కాలంనాటి వలస జీవన విధానంలోకి నెట్టివేస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. సభాధ్యక్షురాలు గాజుల పద్మజ మాట్లాడుతూ, అనంతపురం జిల్లా పేరుకు కరువు జిల్లా అయినా, ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచడంలో అగ్రస్థానంలో ఉందని అన్నారు. మహిళలకు రాజకీయం, ఆర్థిక రంగాలలో సమాన హక్కులకోసం ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని అన్నారు. నేడు మహిళలు పొందుతున్న హక్కులు నాటి ఐద్వా, మహిళా సమాఖ్యల పోరాట ఫలితమేనని అన్నారు. కానీ దేశంలో నేడు కొత్తగా మహిళా సంఘాలు పుట్టుకొస్తున్నాయని, అవేవీ మహిళల కోసం, సమాజంకోసం పనిచేస్తున్న దాఖలాల్లేవని అన్నారు. 2023లో నారీశక్తి పేరుతో మహిళా రిజర్వేషన్ తెస్తామని కేంద్రం చెప్పినప్పటికీ నేటికీ తేలేదని అన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సామాజికవేత్త తీస్తా సైతెల్వాద్

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య


సోమశేఖర్ (ఫైల్)

నంబులపూలకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిపల్లికి చెందిన కౌలు రైతు సోమశేఖర్(24) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. సోమశేఖర్‌కు సొంత పొలం లేదు. మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశారు. రెండేళ్ల నుంచి వరుసగా నష్టపోయాడు. పెట్టుబడికి, కుటుంబ ఖర్చులకు చేసిన రూ.7.50 లక్షల అప్పు భారంగా మారింది. దిక్కుతోచక ఆదివారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. సోమశేఖర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వలీబాషా తెలిపారు.

చేనేత కార్మికుడు..


కొండప్ప (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు సింగనమల కొండప్ప(51) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు, శాంతినగర్‌కు చెందిన కొండప్ప రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ముడిసరుకుల ధరలు పెరగడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు రూ.35 లక్షల దాకా అప్పు చేశారు. వాటిని తీర్చే మార్గంలేక సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. ఆయనకు భార్య వరలక్ష్మి, బీటెక్ కుమారుడు బాలాజీ, కూతురు మీనాక్షి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హంద్రీనీవా కాలువలో పడి వ్యక్తి గల్లంతు


నాగభూషణం

ఆత్మకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు గ్రామ సమీపాన సోమవారం అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం హంద్రీనీవా కాలువలో పడి గల్లంతయినట్లు పోలీసులు తెలిపారు. బెళుగుప్ప మండలం జీడిపల్లిలో బంధువుల కర్మకాండకు వెళ్లి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. కాలువలో స్నానానికి వెళ్లి కాలుజారి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫోన్‌పే చెయ్.. పింఛన్ ఇప్పిస్తా..!

● దివ్యాంగులకు ఓ మోసగాడి ఫోన్‌కాల్

రామగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వికలాంగత్వం ఎక్కువగా ఉండి పింఛన్ రావాలంటే తనకు డబ్బు పంపాలంటూ ఓ వ్యక్తి మండలంలోని పలువురు దివ్యాంగులకు ఫోన్ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు దాదాపు 10మందికిపైగా ఫోన్ చేసి తన పేరు శివ అని, కలెక్టర్ ఆఫీసులో పని చేస్తున్నానని చెప్పి, డబ్బు వసూళ్లకు పూనుకున్నట్లు సమాచారం. చెన్నేకొత్తపల్లిలో దివ్యాంగుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు మీ పర్సెంటేజీ తగ్గించారని, దీంతో పింఛన్ రాదని, పర్సెంటేజీ ఎక్కువగా వేయాలంటే రూ.25వేలు తనకు ఫోన్‌పే చేయాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఇప్పుడు మీవద్ద ఎంత ఉంటే అంత పంపండి. మిగతాది తర్వాత చూద్దాం అంటూ బేరసారాలకు దిగుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. మరికొందరికి ఫోన్ చేసి మీ పింఛన్ నెలకు రూ.15వేలు వచ్చేలా చేస్తానని, దానికి ఖర్చు ఎక్కువ అవుతుందని, అయితే అది ఇప్పుడు కాదు మళ్లీ నెలలో చేస్తానని చెప్పినట్లు తెలిసింది. ఆయన మాయ మాటలకు మోసపోయిన ఒకరిద్దరు డబ్బులు ఫోన్‌పే చేసినట్లు సమాచారం. ఇతడికి ఫోన్ చేస్తే శివ ఏఎస్ఏ, పీటీపీ అని ట్రూకాలర్‌లో వస్తోందని, ఫోన్‌పే చేయాలంటే సాకే శివయ్య అని వస్తున్నట్టు బాధితులు తెలిపారు. ఇతడి గురించి కలెక్టర్ ఆఫీసులో విచారించగా ఆ పేరు గల వ్యక్తి లేరని తెలిసిందన్నారు. దీనిపై రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పందుల అపహరణ.. అడ్డుకున్న వారిపై దాడి

గుత్తి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తురకపల్లి రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి పందులను దొంగలు అపహరించారు. అడ్డుకున్న పందుల యజమాని నారాయణస్వామిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. గుర్తుతెలియని ఐదుగురు దుండగులు బొలెరో వాహనంలో వచ్చి తురకపల్లి రోడ్డులో ఉన్న పందులను అపహరించారు. అడ్డుకోపోయిన నారాయణస్వామితోపాటు మరికొంతమందిపై రాళ్లతో దాడి చేశారు. పది పందులను అపహరించుకెళ్లారని బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాళ్ల దాడిలో అక్కడే ఉన్న మత్స్యకారుడికి చెందిన రెండు వ్యాన్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

గార్లదిన్నె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వైకుంఠవాసుడి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. కృష్ణాపురం గ్రామ సమీపంలో రెండు నెలలు క్రితం వైకుంఠవాసుడి దేవాయం నిర్మించారు. ఆదివారం రాత్రి దుండగులు దేవాలయంలోకి చొరబడి హుండీ తాళం పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ. 20వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు.

గంజాయి స్వాధీనం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి నాలుగు కిలోల ఎండు గంజాయిను సోమవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం. శ్రీరామ్ మాట్లాడుతూ.. హనుమాన్ సర్కిల్‌లో తిరునగరి మోహన్‌సుందర్, సాయికుమార్ ద్విచక్రవాహనంలో ఎండు గంజాయిని తరలిస్తుండగా తమ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ శివసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ భీముని నాయక్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 52 శాతం మార్కులు పొందినవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 15వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. పుట్లూరు మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. అనంతపురం, గార్లదిన్నె, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం గుత్తి, పామిడి, యల్లనూరు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

మమ్మల్నీ బదిలీ చేయండి..

● దొడ్డిదారి బదిలీలపై టీచర్ల ఆశలు
● ఇద్దరికి అవకాశంతో పైరవీలు ప్రారంభం
● సిఫార్సు లేఖల కోసం నేతల వద్దకు పరుగులు
● ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా వ్యవహారం



అనంతపురంవిద్య, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇద్దరు టీచర్లకు రహస్య బదిలీ చేయడంతో మిగతా వారిలో ఆశలు రేగాయి. దొడ్డిదారి బదిలీలకు ఎత్తులు వేస్తున్నారు. 'వారికి చేశారు కాబట్టి, తమకు కూడా చేయాల'ని కోరుతున్నారు. ఆ మేరకు తమ అనుకూల నేతలను వెంటబెట్టుకుని ప్రజాప్రతినిధుల వద్దకు సిఫార్సు లేఖల కోసం క్యూ కడుతున్నారు. 'మన వారేనని, ఎలాగైనా దొడ్డిదారి బదిలీకి అవకాశం కల్పించాలనీ, పైస్థాయిలో కూడా చెప్పాల'ని నాయకులు.. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇద్దరు బదిలీ ఆర్డర్లు ఎంతటి రచ్చకు దారి తీస్తాయోనన్న చర్చ సాగుతోంది.

అప్పట్లో జరిగిపోయింది..

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దొడ్డిదారి బదిలీలు చేశారు. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బంధువులు పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసి, బదిలీలు చేయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గతేడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఆ దొడ్డిదారి బదిలీలను రద్దు చేసింది. ఆ తర్వాత అలాంటి ట్రాన్స్‌ఫర్లకు అవకాశమే లేకుండా చేసింది. ప్రత్యేక చట్టమే తీసుకొచ్చింది. దీంతో ఏడాదిన్నరగా దొడ్డిదారి బదిలీల ఊసే లేకుండా పోయింది. దీంతో టీచర్లు.. ఆ ఆశలు వదులుకున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం దొడ్డిదారిలో ఇద్దరు టీచర్లను బదిలీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్ నుంచి జిల్లా కేంద్ర సమీప మండలానికి ఓ టీచర్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పనిచేస్తున్న ఓ టీచర్‌ను కదిరి నియోజకవర్గంలోని ఓ మండలానికి నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఆ వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం గోప్యంగా అమలు చేసింది. పాత పాఠశాలలో రిలీవ్ చేయించి, కొత్త బడుల్లో చేర్పించారు. ఆ తర్వాత ఆర్డర్లు వచ్చాయని, వారిద్దరు జాయిన్ అయ్యారని టీచర్లలో పెద్దఎత్తున ప్రచారం సాగింది. విషయం బయటకు పొక్కి, జిల్లాలోని ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లింది. ఒకరిద్దరు నేతలు నేరుగా డీఈఓ కార్యాలయానికి ఫోన్ చేసి, బదిలీ ఆర్డర్లు ఎలా వచ్చాయని ఆరాతీశారట. ఈ బదిలీలతో ఇంతవరకు దూరప్రాంతాల్లో పనిచేస్తూ మౌనంగా ఉంటూ వస్తున్న టీచర్లలో దొడ్డిదారి బదిలీలపై ఆశలు మొలకెత్తాయి.

సిఫార్సు లేఖల కోసం పరుగులు

రెండు బదిలీ ఆర్డర్లు.. రాజకీయ నేతలను నిద్రపోనీయడం లేదు. పలువురు తమ బంధువులు, అనుకూలమైన నేతలను వెంటబెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు పరుగులు పెడుతున్నారట. రెండు బదిలీ ఆర్డర్లు వచ్చాయని, తమ వారికి కూడా లేఖలు ఇచ్చి.. పైన చెప్పి ట్రాన్స్‌ఫర్ చేయించాలంటూ ఒత్తిడి పెడుతున్నారట. కీలకమైనవారు వచ్చి అడిగితే కాదనలేక ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చి పంపుతున్నారని సమాచారం. వాటిని తీసుకొని టీచర్లు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. ఆ రెండు బదిలీలు చేశారు కాబట్టి, తమవారికి కూడా చేయాలని అడగండని నేతలపై అనుకూలురు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో దొడ్డిదారి బదిలీలు ఎంత రచ్చకు దారితీస్తాయోనని ఇటు నేతలు.. అటు టీచర్లలో చర్చ సాగుతోంది.

కాకర్ల బ్రదర్స్‌ను సస్పెండ్ చేస్తున్నా: జేసీపీఆర్



మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకర్ల సోదరులను తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. తాడిపత్రి పట్టణంలో పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృత సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న నియోజకవర్గాల్లో వైసీపీ హయాంలో ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీనే టీడీపీ గెలిచిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబం తాడిపత్రిలో ఉన్నంత బలంగా ఎక్కడా లేదనేందుకు ఆ గెలుపే నిదర్శనమని అన్నారు. పిలుపునిచ్చిన ఐదు నిమిషాల్లో ఒక్కచోటకు చేరే టీడీపీ శ్రేణులున్న నియోజకవర్గంలో తాను ఉండటం గర్వంగా ఉందని అన్నారు. ఇక్కడి ప్రజలు తనకు దేవుళ్లని, వారు లేనిదే నియోజకవర్గంలో తాను లేనని భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి టీడీపీ కుటుంబంలో మచ్చ తెచ్చే వ్యక్తులు ఉంటే పార్టీకి చెడ్డపేరు వస్తుందని, అందుకే మీ అభీష్టం మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నానని కార్యకర్తలతో అన్నారు. అన్నదమ్ములైన కాకర్ల రంగనాథ్, కాకర్ల జయుడు, కాకర్ల రంగనాయకులుతో ఇకపై పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. పార్టీకి సంబంధించి వారు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని అన్నారు. టీడీపీలో ఉండి వైసీపీలోకి వెళ్లడం, వైసీపీలో నుంచి టీడీపీలోకి వచ్చి వైసీపీ కోవర్టులుగా ఉండటం సరికాదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వీరు సహకరిస్తున్నారని, అంతర్గత వ్యాపారాలు చేస్తూ కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీరివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందనే ఆలోచనతో ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌కు కార్యకర్తలు మెమొరాండం ఇచ్చారని అన్నారు. రాష్ట్ర నాయకులకు కూడా పంపించారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా పార్టీకి నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఈ సభావేదిక పైనుంచి వారిని సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు.

ఓలాకు అక్షింతలు

● రూ.80,499 కట్టినా.. బైక్ ఇవ్వలేదని వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు
● వడ్డీతో చెల్లించాలని తీర్పు

అనంతపురం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డబ్బు కట్టించుకుని బైక్ డెలివరీ చేయని ఓలా కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసి, వడ్డీతో సొమ్ము చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత సోమవారం తీర్పు వెలువరించారు. కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లికి చెందిన నాగరాజు గతేడాది ఏప్రిల్ 19న ఓలా బైక్ కోసం రూపే క్రెడిట్ కార్డు ద్వారా రూ.80,499 చెల్లించారు. కంపెనీ సదరు కస్టమర్‌కు వాహనాన్ని డెలివరీ చేయలేదు. ఆయన పలుమార్లు ఫోన్లు చేసినా, ఈ-మెయిల్స్ పంపినా స్పందించలేదు. దంతో విసిగిపోయిన అతడు.. గతేడాది అక్టోబరు 18న కంపెనీకి నోటీసు ఇచ్చి, వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణకు హాజరైన కంపెనీ ప్రతినిధులు తమకు కస్టమర్ నుంచీ ఆన్‌లైన్‌లో డబ్బు రాలేదంటూ, మళ్లీ చెల్లించాలంటూ కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చారు. క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించినట్టు బ్యాంకు ఖాతా వివరాలను వినియోగదారుడు.. కమిషన్ ముందు ఉంచాడు. దీంతో కంపెనీ ప్రతినిధుల వాదనను జిల్లా వినియోగదారుల కమిషన్ అంగీకరించలేదు. కంపెనీ సేవల లోపం ఉన్నట్టు గుర్తించింది. కస్టమర్‌కు రూ.80,499 మొత్తాన్ని 9 శాతం వడ్డీతో గతేడాది ఏప్రిల్ 19వ తేదీ నుంచీ చెల్లించాలని తీర్పు ఇచ్చింది. మానసిక వేదనకు రూ.20 వేలు, న్యాయ వ్యయాల కోసం మరో రూ.5 వేలు తీర్పు ఇచ్చిన తేదీ నుంచీ 45 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

వీసా దొరికితే ఇవ్వండి

● ఓ విద్యార్థి వేడుకోలు



పోగొట్టుకున్న ఐడెంటిటీ కార్డు నమూనా

గుడిబండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వీసా, పాస్‌పోర్ట్ ప్రయాణంలో ఎక్కడో పడిపోయాయని, ఎవరికైనా దొరికితే తెలియజేయాలని మండలంలోని మోరుబాగల్‌కు చెందిన విద్యార్థి సుకృత్ సోమవారం ఓ ప్రకటనలో వేడుకున్నాడు. ఐదు రోజుల కిందట మోరుబాగల్ నుంచి హిందూపురానికి డ్రైవింగ్ టెస్ట్ కోసం వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో వాలెట్ పోగొట్టుకున్నాడు. అందులో జార్జియా దేశం వీసా, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, స్టూడెంట్ ఐడీ, ఏటీఎం కార్డులు ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. ఈనెల 23న జార్జియా దేశానికి ఫ్లైట్ టికెట్ కూడా బుక్ చేసుకున్నానని, తన విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎవరికైనా తన వాలెట్ దొరికితే 8328486900, 9182111958, 9182651902లకు సమాచారం అందించాలని విన్నవించాడు.

ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు

● కదిరిలో దారుణం ● వేర్వేరుచోట్ల ఇద్దరు యువకుల హత్య

కదిరి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు ఓ కొడుకు. జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు యువకులను హత్య చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు ముగ్గురిని చంపేశారు. కదిరిలోని నిజాంవలి కాలనీలో ఒంటరిగా నివసిస్తున్న షేక్ ఖాసీంబీ(65)ని ఆమె కుమారుడు షేక్‌బాబా ఆదివారం రాత్రి హత్య చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖాసీంబీకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. కుమారుడు భార్యను వదిలేసి మరో మహిళతో సహజీవనం చేస్తూ నంద్యాల జిల్లా శ్రీశైలంలో ఉంటున్నాడు. రెండు రోజుల కిందట కదిరిలో ఉన్న తల్లి వద్దకు వచ్చి ఆస్తి ఇవ్వాలని అడిగాడు. దీనికి ఆమె తనను చంపి ఆస్తి తీసుకోవాలని చెప్పింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి షేక్‌బాబా.. తల్లి ఖాసీంబీని కత్తితో పొడిచి హత్య చేశాడు. ఉదయమైనా ఖాసీంబీ బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి ఇంట్లోకి చూశారు. రక్తపు మడుగులో ఆమె పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హత్యాస్థలాన్ని పరిశీలించారు. షేక్‌బాబాపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో గొడవ.. హత్య

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో తలెత్తిన గొడవలో ఆనంద్ అలియాస్ బొంబాయి(30) అనే యువకుడిని హత్య చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన ఆనంద్, సలీం స్నేహితులు. ఆదివారం రాత్రి ఇరువురు బస్టాండు ఆవరణలో మద్యం తాగారు. ఆనంద్ మద్యం మత్తులో సలీం, అతడి కుటుంబసభ్యులను దూషించాడు. సలీం కోపంతో ఆనంద్‌ను కొట్టాడు. అతడు కిందపడిపోయాడు. అతడి తలపై బండరాయి వేశాడు. దీంతో ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు.. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. హత్యాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆనంద్‌కు వివాహం కాలేదు. జులాయిగా తిరుగుతుండేవాడు.

హత్య చేసి.. దహనం


పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం: యువకుడిని హత్యచేసి కాల్చేసిన ఘటన మండలంలోని సంతేబిదనూరు వద్ద జరిగింది. రూరల్ సీఐ జనార్దన్ తెలిపిన మేరకు సంతేబిదనూరు సమీపంలో కల్లుదుకాణం నిర్వహించే ప్రాంతంలో కాల్చివేసిన శవం ఉందని సోమవారం తెలిసిందన్నారు. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. హత్యచేసి మృతుడిని గుర్తుపట్టకుండా ఉండటం కోసం ఖాళీ వాటర్ బాటిల్ వేసి నిప్పంటించినట్లు తెలిపారు. దీంతో మొహం మాత్రం కాలిపోయిందన్నారు. కల్లుదుకాణ నిర్వాహకుడిని ప్రశ్నించగా మృతుడు కర్ణాటకకు చెందినవాడని తెలిపాడు. దీంతో గౌరీబిదనూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతుడు గౌరీబిదనూరులోని హనుమంత నగర్‌కు చెందిన పవన్‌కుమార్ (28)గా గుర్తించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తుపట్టారు. దీనిపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌కవేటర్‌కు రూ.45లక్షల జరిమానా


జరిమానా విధించిన ఎక్స్‌కవేటర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వే బిల్లు సరిగా లేకుండా అంతర్రాష్ట్ర రవాణా చేస్తున్న ఎక్స్‌కవేటర్‌కు పన్నుల శాఖ అధికారులు రూ.45 లక్షల జరిమానా విధించారు. ఒకే వాహనంపై ఇంత మొత్తంలో జరిమానా విధించడం ఇదే మొదటిసారని పన్నుల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. పది రోజుల కిందట అధికారులు, సిబ్బందితో కలిసి అనంతపురం-1 సర్కిల్‌లో పనిచేస్తున్న డీసీటీఓ మోహన్ భరత్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఇదే సమయంలో తమిళనాడు నుంచి గుజరాత్‌కు ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్తున్న ట్రక్కును గుర్తించి, తనిఖీ చేశారు. వే బిల్లు సరిగా లేకపోవడంతో వివరాలపై ఆరా తీశారు. తప్పుడు పత్రాలను గుర్తించి రూ.45లక్షలు జరిమానా విధించారు. సంబంధిత యజమానులు సోమవారం ఆ జరిమానా మొత్తం చెల్లించి వాహనం తీసుకెళ్లారు. కాగా వాహనం ఖరీదు రూ.70లక్షలు కావడం గమనార్హం. భరత్ మోహన్ కుమార్ ఆగస్టులో ఎన్‌హెచ్-44 రహదారిపై సరైన పత్రాలు లేని కారణంగా ఓ మిషనరీ తరలిస్తుండగా రూ.30 లక్షలు జరిమానా విధించారు. రెండు నెలల వ్యవధిలో రూ.75 లక్షల పైగా జరిమానా విధించిన డీసీటీఓను పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ హేమ అభినందించారు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 హ్యాండ్‌బాల్, ఖో-ఖో బాలిబాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. బాలికల జట్టులో అర్చన, రక్షిత, సుస్మిత, నాగరత్న, గంగమ్మ, హాసిని, లక్ష్మి, గురువర్షిణి, హరిణి, జనప్రియ, నందిని, ఉమా, అక్షయ, రీతూ, బృందా, హర్షిత, శ్రీహస్త, బాలురలో అభిషేక్, అర్జున్, పవన్‌కుమార్, తరుణ్, పునీత్‌కుమార్, దేవేంద్ర, హిమేష్, శివశంకర్, అభిరాం, సూర్యతేజ, ఉదయ్‌సాయి, జగన్మోహన్, లిఖిత్, లోవరాజు, వర్ధన్, జాఫర్ చోటు దక్కించుకున్నారు. ఖో-ఖో బాలికల జట్టుకు స్వప్న, సోనిక, దానేశ్వరి, అంజలి, లలిత, హరిణి, భవ్యశ్రీ, శ్వేత, ప్రావణి, సంధ్య, జయశాలిని, మౌనిక, బాలురలో నందకిషోర్, కార్తీక్, అనీల్‌కుమార్, హరికృష్ణ, దేవేంద్ర, నరేంద్ర, చరణ్, సందీప్, పురణ్‌చంద్ర, గణేష్‌కుమార్, జైకృష్ణ, హర్ష ఎంపికయ్యారు. ఆయా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, మురళి, మారుతి, శ్రీధర్, రమేష్, రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, సంజీవరాయుడు, శాప్ కోచ్ ఆలీ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ అండర్-23 జట్టులో కమిల్



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-23 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన కమిల్‌కి చోటు దక్కింది. గుంతకల్లుకు చెందిన కమిల్ ఈ సీజన్‌లో ఆడిన ఆట ప్రతిభ ఆధారంగా ఏసీఏ అండర్-23 జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 16వతేదీ నుంచి అనంతపురంలో నిర్వహించే బీసీసీఐ కోల్ సీకే నాయుడు ట్రోఫీలో ఢిల్లీతో తలపడే ఆంధ్రా క్రికెట్ జట్టు తరఫున కమిల్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆంధ్రా జట్టులో చోటు సాధించిన కమిల్‌కు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రధాని సభకు అనంత బందోబస్తు

● జిల్లా నుంచి సుమారు 350 మంది పోలీసులు

అనంతపురం క్రైం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో బందోబస్తు కోసం అనంతపురం నుంచీ పలువురు పోలీసులను నియమించారు. వారంతా సోమవారం బయలుదేరి వెళ్లారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం కర్నూలులో భారీగా నిర్వహించనున్నారు. ఈనెల 16న కర్నూలులో రోడ్ షో తోపాటు, ఓర్వకల్లు మండలంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీంతో బందోబస్తు కోసం అనంతపురం జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 21 మంది ఎస్ఐలు, 300 మందిపైచిలుకు కానిస్టేబుళ్లు, ఇతర అధికారులను నియమించారు. ఈనెల 16వతేదీ వరకూ వారు అక్కడ విధుల్లో పాల్గొంటారు.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

గుంతకల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉత్తర రైల్వేలోని జమ్మూతావి రైల్వే డివిజన్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను నవంబరులో రద్దుపరచనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-జమ్మూతావి ఎక్స్‌ప్రెస్ (నం. 22705) రైలును నవంబరు 4వ తేదీ నుంచి, దాని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22706)ను నవంబరు 7 నుంచి చేస్తున్నామన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ రైలును నిరవధికంగా రద్దుచేసినట్లు వివరించారు.

సదరం క్యాంపులు వాయిదా: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో అనంతపురం, నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో జరగాల్సిన సదరం క్యాంపులు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో జరగాల్సిన సదరం క్యాంపులపై ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ పద్మావతి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ తేదీలలో సదరం క్యాంపులకు హాజరు కావాల్సిందిగా ఇదివరకే నోటీసులు పొందిన పింఛనుదారులు వాయిదాను గమనించాలని సూచించారు. సవరించిన షెడ్యూల్‌ను అందరు దివ్యాంగులకు ఎస్ఎంఎస్, ఇతర మార్గాల ద్వారా తెలియజేస్తామన్నారు.

నేడు సెమినార్

కొత్తచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):'క్వాంటం ఏజ్ అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ కిష్టప్ప ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 9 గంటలకు సెమినార్ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 9492843184 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులను ఈనెల 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక చేస్తామని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి.. సంక్షేమం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని బుక్కచెర్లలో సోమవారం ఆయన 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి నిధులు కలిపి రూ. 17 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బుక్కచెర్ల సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నారాయణస్వామి పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు గ్రామంలో పలువురు మహిళలకు సోమవారం రాయితీతో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి పాల్గొని సుమారు 40 మందికి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడు తూ.. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో మండలంలోని గ్రామాల్లో మహిళలకు కుట్టుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లును అందజేస్తున్నట్లు తెలియజేశారు. వీటిని స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రాయితీతో అందజేసినట్లు పేర్కొన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణగోపాల్ రెడ్డి, లక్ష్మీదేవమ్మ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కిశోర్, వన్నూరుస్వామి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను వీసీగా నియమించాలి'

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆచార్యులను నియమించాలని వర్సిటీ బీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు డిమాండ్ చేశారు. వర్సిటీలోని నాన్ టీచింగ్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్కేయూనివర్సిటీకి ఇంతవరకు ఒక్కసారి కూడా బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఆచార్యులను వైస్ చాన్సలర్‌గా నియమించకపోవడం బాధాకరమన్నారు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఆచార్యులను పలుదఫాలు నియమించిన ప్రభుత్వాలు బీసీ వర్గానికి చెందిన వారిని మాత్రం నమియమించలేదన్నారు. బీసీ ఆచార్యుల పట్ల చిన్నచూపు చూడడం తగదన్నారు. ఇప్పుడైనా నియమించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శివానంద, రాష్ట్ర యూనివర్సిటీల బోధనేతర ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాగే నాగభూషణం, బోధనేతర ఉద్యోగసంఘం ఉపాధ్యక్షులు నాగముని, నాగేంద్ర, నారాయణస్వామి, టైంస్కేల్ ఉద్యోగ సంఘం కాశాధికారి నీలకంఠ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో లిపిడ్ బేస్డ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ అనే అంశంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. బీఫార్మసీ, ఫార్మా-డీ చివరి సంవత్సరం విద్యార్థుల కోసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో హైదరాబాద్ జేఎన్‌టీయూ ఫార్మాసూటికల్ సైన్సెస్ సుల్తాన్‌పూర్ ప్రిన్సిపాల్ సునీత రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరంగా అధునాతన లిపోజోమ్స్, నియోజోమ్స్ అనే ఔషధ పంపిణీ వ్యవస్థల రూపకల్పన, మానవ శరీరంలో వాటి పనితీరును ఏవిధంగా పరిశీలించవచ్చునో వివరించారు. తర్వాత ముఖ్య అతిథిని ఓటీపీఆర్ఐ సంచాలకులు సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ గోపినాథ్ తదితరులు పూలమాలలు, శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, కార్యక్రమ సమన్వయకర్త మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల ఔదార్యం

● తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబ సభ్యురాలికి చెక్కు అందజేస్తున్న వీసీ అనిత

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఇటీవల మరణించిన తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. వర్సిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వారు తమ ఒక్కరోజు వేతనానికి సంబంధించిన రూ.లక్ష చెక్కును వర్సిటీ వైస్ చాన్సలర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు చేతులమీదుగా ఉద్యోగి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. నెల కిందట వర్సిటీ ఉద్యోగి బాబాసాహెబ్ మృతి చెందారన్నారు. అతడి కుటుంబానికి నాన్ టీచింగ్ ఉద్యోగులు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు నాగమునీంద్ర, ప్రధాన కార్యదర్శి మారుతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనరసింహులు, కోశాధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శింగనమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ రఘనాథ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. శింగనమల సబ్‌స్టేషన్‌లో డీపీలకు మరమ్మతులు చేయనున్నారని, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దాసుపత్రిని 1200 పడకలుగా మారుస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వెల్లడి
● 20 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (పెద్దాసుపత్రి)ని 1200 పడకల ఆసుపత్రిగా మారుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వెల్లడించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేపట్టారు. అర్బన్ నియోజకవర్గంలోని 20 మందికి రూ. 22 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ఆయా లబ్ధిదారులకు అందజేశారు. తర్వాత మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవలను రాష్ట్రంలో మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా చితికిపోయిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురం అర్బన్‌లో ఇప్పటి వరకూ రూ. 3.50 కోట్లు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామన్నారు. జిల్లా ఆసుపత్రి ప్రస్తుతం 560 పడకలుగా ఉందని, దానిని త్వరలోనే 1200 పడకలకు విస్తరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అందుకు సంబంధించిన డీపీఆర్‌లు ప్రభుత్వానికి చేరాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కొత్త టీచర్లకు సన్మానం

అనంతపురం క్రైం: డీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన టీచర్లను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సన్మానించారు. నగరంలోని పొట్టిశ్రీరాములు, నేతాజీ మున్సిపల్ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. అక్కడ కొత్తగా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి.. తర్వాత మాట తప్పిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేసి, శరవేగంగా పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఈ ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. అనంతపురం అర్బన్‌లో 57 మంది కొత్త టీచర్లు స్కూళ్లకు వచ్చారని తెలిపారు. కొత్త టీచర్లు బాధ్యతగా పనిచేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.

కోర్టు కేసులపై అలసత్వం వద్దు: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో పలు సమస్యలపై నమోదైన కోర్టు కేసులకు సంబంధించి ఎక్కడా అలసత్వం లేకుండా ఎప్పటికి అప్పుడు పరిష్కార మార్గాలు చూపేలా చర్యలు చేపట్టాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. నగరంలోని డీపీఓ కార్యాలయంలోని తమ చాంబర్‌లో సోమవారం సాయంత్రం ఆయన ఏఓలు నాగరాజు, సోమశేఖర్‌తో కలిసి కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. అందులో ప్రధానంగా కోర్టు కేసులను ఎక్కడా అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దీంతో పాటు సిబ్బందికి సంబంధించి పదోన్నతులు, సీనియారిటీ జాబితా తయారీ, నియామకాలకు సంబంధించి ప్లేస్‌మెంట్స్ కేటాయించడంలో పెండింగ్ లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. మీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉన్నట్లు అయితే మా దృష్టికి తేస్తే క్లియర్ చేయడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్లు ఉషారాణి, భారతి, జూనియర్ అసిస్టెంట్లు ఉషశ్రీ, శాలినీ, సాయి, నితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో పీజీఆర్ఎస్‌కు 8 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పాలక సంస్థలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఇందులో ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్‌తో కలిసి కమిషనర్ బాలస్వామి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 8 వినతులు రాగా అందులో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలపై ఉన్నాయి. నాణ్యత లేని నాసిరకం అపార్ట్‌మెంట్‌లో ప్లాట్లను అధిక ధరకు కట్టబెట్టి తమకు అన్యాయం చేశారని ఖాజానగర్‌లో ఉన్న భాస్కర్‌హోమ్స్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంల చేయాలని పీజీఆర్ఎస్‌లో అధికారులను కోరారు. అలాగే నగర జనాభా పెరుగుతున్నందున ప్రత్యేక స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ సభ్యులు కోరారు.

న్యాయం చేయాలని వినతి

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ పొలాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లలో కొందరు వ్యక్తులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారి నుంచి న్యాయం చేయాలని పాపంపేట గ్రామ ప్రజలు కోరారు. ఆమేరకు సోమవారం వారు గ్రామం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు.

వైద్యులు డ్యూటీలో ఉండాల్సిందే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయశ్రీ, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

అనంతపురం వైద్యం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హాస్పిటల్‌కు వచ్చిన రోగులకు వైద్యసేవలందించడం డాక్టర్లుగా మనవిధి అని, ప్రతి డాక్టర్ డ్యూటీలో ఉండాల్సిందేనని, విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజనవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎమెర్జెనీ విభాగంలో నెలకొన్న సమస్యలపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమవుతున్నాయి. ఇందులో భాగంగా 'అత్యవసర వేళ ఆక్రందనలు..!' అనే శీర్షికన గత సోమవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వైద్యవిద్య కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ సుబ్రమణ్యం వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎమర్జెన్సీ విభాగాల్లో రోగులను ఎప్పటికప్పుడు పరీక్షించి వార్డులకు పంపాలని, సీరియస్ కేసులను ఏఎంసీకి షిఫ్ట్‌చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు బెడ్ల సంఖ్యను పెంచుతున్నామని, సకాలంలో పరీక్షలు పూర్తిచేసేలా ల్యాబ్‌ను ఏర్పాటుచేస్తున్నామని, సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. డాక్టర్లు విధిగా డ్యూటీలో ఉండాల్సిందేనని పేర్కొన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

ఆంధ్రజ్యోతి స్పందన

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం'

శింగనమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. మండలంలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, కొరివిపల్లి, అలంకరాయనిపేట, జూలాకాల్వ పి.జలాలపురం గ్రామాల్లో సోమవారం ఆయన రచ్చబండ ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల చేత సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు చేస్తుండడం తగదన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు గోకుల్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరంధామరెడ్డి, వెంకటరాముడు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



మహిళాకార్మికులకు చీరలు పంపిణీ చేసిన నాయకులు

గార్లదిన్నె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ వద్ద సోమవారం ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కల్లూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనాథ్‌నాయుడు, కోమలి నారాయణరెడ్డి, నాగేష్‌యాదవ్, నరసింహ యాదవ్, శేఖర్, నెట్టికంటి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థులు..



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. పోలీసులు సోమవారం రాత్రి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. మండలంలోని మేడాపురంలో 5వ తరగతి చదువుతున్న నాగవర్దన్, తరుణ్ అనే ఇద్దరు విద్యార్థులు ఈనెల 11వతేదీన ఇళ్లు వదిలి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో ధర్మవరం రైల్వేస్టేషన్‌లో గాలించగా అక్కడి సీసీ కెమెరాల్లో విద్యార్థులు రైలు ఎక్కినట్టుగా గుర్తించి వెంటనే ఇద్దరు పోలీసులను తిరుపతికి పంపించారు. విద్యార్థులు చిత్తూరు జిల్లా పీలేరు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. ఆ స్టేషన్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా వారు మరో రైలు ఎక్కిపోతున్నట్టుగా గుర్తించారు. ఆ రైలు పాకాల స్టేషన్‌లో ఆగగా పోలీసులు ఇచ్చిన సమాచారంతో అక్కడి రైల్వేపోలీసులు ఆ ఇద్దరు విద్యార్థులను రైలు నుంచి కిందకు దించి స్థానిక పోలీసులకు అప్పగించారు. చెన్నేకొత్తపల్లి పోలీసులు అక్కడికి వెళ్లి ఆ ఇద్దరు విద్యార్థులను పిలుచుకొచ్చారు. ఎస్ఐ, సిబ్బంది ఆ విద్యార్థులను సోమవారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి వీసీ అభినందనలు

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇస్రో, అంతరిక్ష పరిశోధన భారతదేశ విజయాలు, భవిష్యత్ దిశ అనే అంశంపై శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సాయి దినేష్ ప్రతిభ చాటారు. ఇందుకు సోమవారం ఆ విద్యార్థిని వర్సిటీ వైస్ చాన్సలర్ అనిత అభినందించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ.. నగరంలోని ది ట్రెల్లిస్ స్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి వాద ప్రతివాద పోటీల్లో విశేష ప్రతిభ కనబరించారన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలు, దేశ అభివృద్ధిలో దాని కీలక పాత్రపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తద్వారా తదుపరి దశకు ఎంపిక య్యారన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, సమాజం, పెద్దల పట్ల గౌరవం, బాధ్యత పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర క్రీడా యువజన వ్యవహారాల శాఖ హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగచంద్ర బరీదు సూచించారు. విద్యార్థులలో క్రమశిక్షణ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన స్కౌట్స్ అండ్ గైడ్స్ అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం ఆయన స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు సంస్కారం, సమాజం పట్ల బాధ్యత కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు స్కౌటింగ్ కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్‌షఫీ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

అనంతపురం అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నేషనల్ హార్టికల్చర్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టే క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీడీపీ) అమలుపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని రైతు బజార్ వద్ద ఉన్న ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఈ సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రభుత్వ సలహాదారుడు విశ్రాంత జాయింట్ డైరెక్టర్ విద్యాశంకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఇందులో జిల్లాలో అరటి, దానిమ్మ, టమోటా, కళింగర, కర్బూజ తదితర పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, ఎగుమతికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, విలువ ఆధారిత ఉత్పత్తులను పెంచడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు చెప్పారు. ఎఫ్‌పీఓలు, పారిశ్రామిక ఔత్సాహికులు, ట్రేడర్లు, రవాణాదారులు, కోఆపరేటివ్ సొసైటీలు, ఎన్‌జీఓలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 3వ తేదీ నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టనున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్మికులతో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామికి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెకు పోవాలని నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వేణుగోపాల్ నాయుడు, నాయకులు శివకృష్ణ, ప్రసాద్, రఫీ, ఎర్రప్ప, తిరుమలయ్య, శ్రీరాములు, నాగభూషణ, శివ, నాగరాజు పాల్గొన్నారు.

నకిలీ మద్యం అరికట్టాలని వైసీపీ నిరసన

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం అరికట్టాలంటూ నగరంలో సోమవారం వైసీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... నకిలీ మద్యంను అరికట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై తక్షణం సీబీఐ దర్యాప్తు జరిపించాలన్నారు. మద్యం దుకాణాలు, పర్మిట్ గదులు, బార్లలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేయాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ అందుబాటులో లేరని ఆయన వచ్చేవరకు ఆందోళన విరమించమని భీష్మించారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ అరెస్ట్ చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య రావడంతో వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

నార్పల,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండలకార్యదర్శి సాకే నాగరాజు, సహాయ కార్యదర్శులు చాపల రామాంజి, సాకే సుధాకర్, నాయకులు పెద్దపెద్దయ్య, నవీన్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్ల తనిఖీ

అనంతపురం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు హాస్టళ్లను జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ఎస్సీ బాలికల కాలేజీ హాస్టల్, బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి వంట గదులను పరిశీలించారు. అలాగే సరుకులు, వంటలకు వాడే కందిపప్పు, ఆయిల్, ఇతర కిరాణా పదార్థాలను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. డీఎల్ఎస్ఏ, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు గురించి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గార్లదిన్నె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేట సమీపంలో గల 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన జగదీష్ (38), రాయదుర్గంకు చెందిన నందకిశోర్, మణి మరొకరు కలిసి కనుంపల్లి సమీపంలోని పప్పుల ఫ్యాక్టరీలో కార్మికులుగా పని చేస్తున్నారు. కాగా వారు సోమవారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్ర వాహనాల్లో గార్లదిన్నెకు వచ్చి తిరిగి ఫ్యాక్టరీకి బయలుదేరారు. తిమ్మంపేట దాటగానే ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ప్రమాదంలో జగదీష్ అక్కడిక్కడే మృతి చెందగా మణి, నందకిశోర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ అంజనరెడ్డి, సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికులను తొలగించరాదని ఆందోళన

అనంతపురం విద్య, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాఆస్పత్రి, మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను, సెక్యూరిటీ గార్డులను తొలగించరాదంటూ ఏఐటీయూసీ నాయకులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకుడు రాజేష్‌గౌడు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను తొలగిస్తామని బెదరిస్తున్నారన్నారు. అలాంటి చర్యలు తీసుకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

ప్రజాసేవకుడు కేశవరెడ్డి

● కొనియాడిన టీడీపీ నేతలు ● ఘనంగా ముంటిమడుగు జన్మదిన వేడుకలు

గార్లదిన్నె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల కోసం శ్రమించే ప్రజా సేవకుడు ముంటిమడుగు కేశవరెడ్డి అని పలువురు టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం గార్లదిన్నె, కల్లూరు తదితర గ్రామాల్లో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గార్లదిన్నె పార్టీ జెండా కట్టవద్ద, కల్లూరులోని నీలం సంజీవరెడ్డి సర్కిల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పేదలకు ఎన్నో విధాలుగా కేశవరెడ్డి సేవలందించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవికి వన్నె తెస్తున్న నాయకుడిగా కేశవరెడ్డి గుర్తింపు పొందారన్నారు. సొంత నిధులతో ఎంపీఆర్ డ్యాం గేట్లకు మరమ్మతులు చేయించి సాగునీటి వృథాను అరికట్టి రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య, గేటుక్రిష్ణారెడ్డి, గుర్రం ఆదినారాయణ, నాగరాజు, జయరాం, గుత్తాబాలకృష్ణ, సుధాకర్‌రెడ్డి, పవన్, నరసింహారెడ్డి, చితంబరప్ప, మాహీరా, శేఖర్, రామంజి, గుర్రం శీనా, ఈశ్వరయ్య, శ్రీనాథ్‌నాయుడు, కోమలినారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బయ్య, సురేష్, ఆవుల శీనా, వెంకటేష్, కళ్యాణ్, శ్రీధర్ పాల్గొన్నారు.



గార్లదిన్నెలో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు



గార్లదిన్నె ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం



కల్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం, బ్రెడ్ల పంపిణీ

నీళ్లు వాళ్లకు.. పన్నులు వీళ్లకు..!




జీబీసీలో మోటార్లు ఏర్పాటు చేసుకున్న నాన్ ఆయకట్టు రైతులు, రెండు కిలోమీటర్ల దూరం వరకు వేసుకున్న పైపులు

- జీబీసీ నీరు అందకున్నా పన్ను కట్టాలట!
- రూ.4.48 కోట్లు చెల్లించాలని ఆయకట్టు రైతులపై అధికారుల ఒత్తిళ్లు
- ఇళ్ల వద్దకు వెళ్లి మరీ నిలదీతలు
- నీటిని యథేచ్ఛగా వాడుకుంటున్న నాన్ ఆయకట్టు రైతులు
- వారిపై చర్యలు... పన్నులు శూన్యం

విడపనకల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కాలువ) ఆయకట్టు రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. సాగునీరు అందక బాధపడాలో... అందని నీటికి తీరువా (సాగు నీటి పన్ను) కట్టాలో.. అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబరులో నీటి తీరువాను రెవెన్యూ అధికారులు వసూళ్లు చేస్తారు. అందులో భాగంగా ఈ సారి ఆయా గ్రామాల్లోని రైతుల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి నీటి పన్ను కట్టాలని నిలదీస్తున్నారు. పన్ను కట్టని రైతులకు రెవెన్యూ కార్యాలయంలో వన్‌బీలు కానీ ఏ ఇతర పనులు కానీ చేయకుండా నిలిపివేస్తున్నారు. మండలంలో మొత్తం రైతులు రూ. 4.48 కోట్లు నీటి తీరువా చెల్లించాల్సి ఉంది.

జల చౌర్యం..: 15 సంవత్సరాలుగా జీబీసీకి పూర్తి స్థాయిలో సాగు నీరు అందటం లేదు. ప్రధాన కాలువపై నాన్ ఆయకట్టు రైతులు అక్రమంగా మోటార్లతో రాజకీయ నాయకుల మద్దతుతో యథేచ్ఛగా జలచౌర్యానికి పాల్పడుతున్నారు. చివరి ఆ యకట్టు రైతులకు ఒక్క తడి సాగు నీరూ అందడం లేదు. దీంతో వర్షాలపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. వైసీపీ హయాంలో సాగునీటి కోసం ఆయకట్టు రైతులు రోడెక్కి ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

చర్యలు శూన్యం: నాన్ ఆయటు్ట రైతులు దర్జాగా జలచౌర్యం చేస్తున్నా.. అధికారులు వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. రెండు, మూడు కిలోమీటర్లు దూరం ఉన్న సరే కాలువ నీటిని తోడుకునేందుకు పైపులు వేసుకుని మరీ అక్రమంగా వాడేసుకొంటున్నారు. రూ. లక్షలు సంపాదిస్తున్నారు. ఆయకట్టు రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదు. అయినా రెవెన్యూ అధికారులు మాత్రం ఒక్కొక్క రైతు నుంచి రూ. 20 వేలు, 30వేలు పన్ను కట్టాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఈ పన్నులు తాము కట్టలేమని.. వాటిని రద్దు చేయాలని ఆయటు్ట రైతులు వేడుకుంటున్నారు.

చుక్కనీరు రాలేదు



నాకు జీబీసీ కాలువ 9వ డిస్ట్రిబ్యూటరి కింద ఐదు ఎకరాలు సాగుభూమి ఉంది. చివరి ఆయకట్టుకు చుక్క నీరు రాదు. ఏటా ఇదే పరిస్థితి. వర్షాలపై ఆధార పడి పంటలు పండిస్తున్నా. నాన్ ఆయకట్టు రైతులు మాత్రం మోటార్లు పెట్టి నీటిని వాడుకుంటున్నారు. వాళ్లని అడిగే వాళ్లే లేరు. కానీ మేం మాత్రం నీటి పన్ను కట్టాలంటా.

-సితంబరరెడ్డి, కడదరబెంచి ఆయకట్టు రైతు

ఇదెక్కడి న్యాయం?



నాన్ ఆయకట్టు రైతులు నీళ్ల దోచుకుని రూ. లక్షలు సంపాదిస్తున్నారు. వారు పన్ను కట్టాల్సిన అవసరం లేదంటా. మాకు చుక్కనీరు రాదు. మేం మాత్రం పన్నులు కట్టాలంటా. ఇదెక్కడి న్యాయం. దర్జాగా నీటిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు.. పన్నులు చెల్లించాలని మాత్రం ఇళ్ల వద్దకు వచ్చి మరీ మమ్మల్ని నిలదీస్తున్నారు.

-మనోహర్, ఆర్.కొట్టాల, ఆయకట్టు రైతు

రికార్డుల ప్రకారమే పన్నులు

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక పోతే ఆ విషయం జీబీసీ అధికారులకు తెలపాలి. మాకు రికార్డులో ఉన్న ప్రకారమే ఆయకట్టు భూమి ఉన్న రైతుల నుంచి సాగునీటి పన్నులు వసూలు చేస్తున్నాం. ఆయకట్టు రైతుల పన్ను తొలగింపు అనేది ప్రభుత్వం చేతిలో ఉంటుంది. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందని రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి న్యాయం చేస్తారు.

-రమాదేవి, తహసీల్దార్

న్యూస్ బాక్స్

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

పుట్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం భూమిపూజ చేస్తున్నట్లు ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ శివరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తారని, మినరల్ వాటర్‌ప్లాంట్, జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

29 నుంచి కసాపురంలో కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కసాపురం ఆలయ గోపురాలకు కలశ ప్రతిష్ఠ మహోత్సవాలను ఈనెల 29, 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం కసాపురం దేవస్థాన ఆవరణంలో కలశ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవస్థాన ఈఓ విజయరాజు ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని కితాబిచ్చారు. కసాపురం గ్రామ ప్రజలు కూడా సహకారాన్ని అందజేయడం ముదావాహ విషయమన్నారు. కలశ ప్రతిష్ఠ మహోత్సవాలకు గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అధికారులు దేవస్థానంలో 27 అభివృద్ధి కార్యక్రమాలను ఏక కాలంలో చేపట్టడం, దాతలు అదేస్థాయిలో ముందుకు రావడం సంతోషకర విషయమన్నారు. ఆలయ ఈఓ విజయరాజు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల అనంతరం దేవస్థానం అద్భుతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, ధర్మకర్త సుగుణమ్మ, ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు నగదును వెంటనే కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో నూతన కౌలురైతు చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది అవుతున్నా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మధుసూదన్, వీరాంజనేయులు, మురళి, సీపీఎం నాయకులు అంజినేయులు, జ్ఞానమూర్తి, సిద్ధప్ప, శీనప్ప పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ రాజకీయ నాయకుడికి లేని ఆదరణ తనకు ఉందని, తాను పిలిపిన ఐదు నిమిషాల్లోనే వేలాది మంది వస్తారన్నారు. ప్రజలే తనకు దేవుళ్లని, ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. తాను చెబితే సీట్లు ఇచ్చే పరిస్థితి లేదని, ప్రజల మధ్య ఉన్న వారికే పట్టం కడతారని అన్నారు. యాడికి కాలువకు జేసీ అశ్మిత్‌రెడ్డి నీళ్లు తెప్పించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలోమార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు చింబిలి వెంకటరమణ, ఎంపీ రంగారెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, సూర్యముని, వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పట్టని ప్రజాప్రతినిధులు

బొమ్మనహాళ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై ఏ మాత్రం చర్చించలేదు. కేవలం తమకు రావాల్సిన జీతాల గురించే ఆరా తీశారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష జరుగుతుండగా సభ్యులు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు. చివరికి శ్రీధరఘట్ట సర్పంచ్ యోగీశ్వరరెడ్డి మాత్రమే మిగిలారు.

ఆర్టీఐ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

కుందుర్పి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు, దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆర్టీఐ ఆవిర్భావ సభలో వారు మాట్లాడారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రజలు ఆర్టీఐ కమిటీని ఆశ్రయించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని డీటీ తిప్పేస్వామి, ఎంపీడీఓ, వెలుగు అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ గౌరవ అధ్యక్షులు టీకే గోపాల్, గౌరవ సహాయ కార్యదర్శులు ఈరన్న, కోదండ, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు బీసాలప్ప, ప్రకాష్ ఆర్టీఐ కమిటీ సభ్యులు రామదాసు, నాగభూషణ, బోర్ల నాగరాజు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన ర్యాలీ

రాయదుర్గంరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించడానికి సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన విప్ మాట్లాడుతూ... ఈ జీఎస్టీ సంస్కరణల ద్వారా కోట్లాది మందికి లబ్ధి చేకూరుతోందని, ఈ విషయాన్ని అన్నివర్గాలకు తెలియజేయాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులకు ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాజుల వెంకటేశులు, పురుషోత్తం, బండి భారతి, పూజారి తిప్పయ్య, సంపత్‌కుమారి, సంపత్‌కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

బెళుగుప్ప, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి బడి రుణం తీర్చుకుందాంలో భాగంగా పూర్వ విద్యార్థులు చేయూత అందించారు. పూర్వ విద్యార్థి చార్టెడ్ అకౌంటెంట్ ఆర్జీ గుప్తా ఆధ్వర్యంలో బ్యాక్ అనిమల్ హెల్త్ ఇండియా సహకారంతో పాఠశాల అభివృద్ధికి సహకరించారు. రూ.2.50 లక్షలతో 50 డెస్కులు అందజేశారు. రూ.మూడు లక్షలతో ముఖద్వారానికి ఇనుప గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను డీవైఈఓ మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ, హెచ్‌ఎం వెంకటప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్య సోమవారం పరిశీలించారు.

మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న భూమా నాగరాగిణి

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా భూమా నాగరాగిణి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మొదట ఆమె.. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనంపై ర్యాలీగా మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు. మొత్తం 20 మంది సభ్యులతో సెక్రటరీ రంగనాథ్ ప్రమాణస్వీకారం చేయించారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా ఎంపికైన భూమా నాగరాగిణి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనను నమ్మి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమించినందుకు రుణపడి ఉంటానన్నారు. రైతులు, వ్యాపారులను సమన్వయం చేసుకొని మార్కెట్ యార్డ్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు అన్నివిధాలుగా మార్కెట్‌యార్డును ఉపయోగించుకోవచ్చునని, సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. అభివృద్ధిలో మహిళ పాత్రే కీలకమని, అందుకే మార్కెట్ యార్డ్‌ను వారి చేతుల్లో పెడుతున్నానని అన్నారు.

21వ వార్షిక మహాసభ

పెద్దపప్పూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల శ్రీశక్తి మండల సమైక్యనంతో 21వ వార్షిక మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024, 2025కు సంబంధించి ప్రగతి నివేదిక, యాడిట్ రిపోర్ట్ , భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను మండల సమైక్య ఈసీ సభ్యులకు శ్రీశక్తి మండల సమైక్య అధ్యక్షురాలు విజయమ్మ చదివి వినిపించారు. అనంతరం ఈసీ సభ్యులు వాటిని ఆమోదించారు. అనంతరం శ్రీశక్తి మండల సమైక్య నూతన ఓబీ సభ్యులుగా పెద్దపప్పూరు గ్రామ సంఘానికి అధ్యక్షురాలిగా వెన్నెల, కార్యదర్శిగా స్వర్ణాంజలి, కోశాధికారులుగా జ్యోతిని సీసీ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివకుమార్‌రెడ్డి, సీసీలు, వీఓలు, మండల సమైక్య ఓబీ సభ్యులు, గ్రామ సంఘం సీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

ఏఓను బదిలీ చేయాలి

మార్కెట్‌యార్డ్ చైర్మన్, రైతుల డిమాండ్.. నిరసన



వ్యవసాయ కార్యాలయం వద్ద నాయకులు, రైతుల నిరసన

డీ.హీరేహాళ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా మండల వ్యవసాయాధికారి కృష్ణకిషోర్‌రెడ్డి తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని, పలుమార్లు సూచించినా.. ఫిర్యాదులు చేసినా అతనిలో మార్పు రాలేదని, అతన్ని బదిలీ చేయాలని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాళం వేసిన మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నిత్యం మండల వ్యవసాయాధికారి విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతో అతని కార్యాలయం ఎప్పుడూ మూసి ఉంటోందని వాపోయారు. మండలంలో 90 శాతంపైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారని, వ్యవసాయాధికారి అందుబాటులో లేకుంటే ఇక రైతుల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తాము ఫోన్ చేసినా కనీసం లిఫ్ట్ కూడా చేయరని అన్నారు. పలుమార్లు ధర్నాలు చేసినా ఆయనలో మార్పు రాలేదని, ఉన్నతాధికారులు ఆయన్ను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

జీఓ రద్దుపై వెలుగు సిబ్బంది హర్షం

బెళుగుప్ప, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వెలుగుశాఖలో పనిచేస్తున్న యానిమేటర్ల కాలపరిమితి జీఓను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో వారు సోమవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలను క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, నాయకులు, వైస్ ఎంపీపీ తిమ్మప్ప, సర్పంచ్ రాము, కాలువపల్లి అనిల్, ఏపీఎం సురేఖ, రవితేజ, సమైక్య సంఘం అధ్యక్షుడు భాగ్యమ్మ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

అభివృద్ధే కూటమి లక్ష్యం: విప్

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

డీ.హీరేహాళ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అందులో భాగంగా వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేసి ఇటు నిరుద్యోగులు .. అటు విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలో మురడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. జిల్లాలో 755 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించగా అందులో 247 మంది 32.7 శాతం ఉపాధ్యాయులను ఒక రాయదుర్గం నియోజకవర్గంలోనే నియమించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కొత్త ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ గంగాధర, ఆనంద్‌రెడ్డి, ఎంపీడీఓ దాసనాయక్, దొడఘట్ట రామాంజినేయులు, చన్న, వీరపరంధామ పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఒకరు ఉర్దూ, 12 మంది సెకండరీ గ్రేడ్ తెలుగు మీడియం ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో విధుల్లో జాయిన్ అయ్యారు. ముందుగా స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓలు 1,2 వద్ద జాయినింగ్ ఆర్డర్లను తీసుకున్నారు. అనంతరం వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి హెచ్‌ఎంల వద్ద జాయిన్ అయ్యారు. వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

● బొమ్మనహాళ్ : మండలంలోని పలు పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు బొమ్మనహాళ్ ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు ముగ్గురు ఎస్‌జీటీలు, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న చోట 49 మంది స్కూల్ అసిస్టెంట్‌లు బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. ఇంకా మండలంలో 15 స్కూల్ అసిస్టెంట్లు, ఒక ఎస్జీటీ పోస్టు ఇంకా ఖాళీగా ఉన్నాయన్నారు.

● కణేకల్లు : మండలంలో మొత్తం 29 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. అందులో 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, పీడీలు పది మంది, ఒక ఎస్‌జీటీ టీచర్ ఉన్నారు.

● కుందుర్పి: మండలంలో నూతన ఉపాధ్యాయులు ఆయాపాఠశాలలో సోమవారం విధుల్లో చేరినట్లు మండల విద్యాశాఖాధికారులు తిప్పేస్వామి, లక్ష్మీదేవి తెలిపారు. వారిలో 33 మంది స్కూలు అసిస్టెంట్లు, పదిమంది ఎస్జీటీలు ఉన్నారన్నారు. నూతన ఉపాధ్యాయులకు తోటి సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగతం పలికారు.



డీ.హీరేహాళ్ : మురడిలో నూతన ఉపాధ్యాయులతో విప్ కాలవ,



గుంతకల్లు: కొత్త టీచర్లకు జాయినింగ్ ఆర్డర్లు ఇస్తున్న ఎంఈఓలు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు రోడ్డులోని గ్రానైట్ పరిశ్రమ వద్ద గుర్తుతెలియని టిప్పర్ ఢీకొనడంతో యల్లనూరుకు చెందిన ఆటో డ్రైవర్ కుళ్లాయప్ప (38) మరణించాడు. కుళ్లాయప్ప ఎప్పటిలాగే యల్లనూరు నుంచి తాడిపత్రికి ఆటోలో వచ్చాడు. చుక్కలూరురోడ్డుకు బాడుగకు వెళ్లి తిరిగి వస్తుండగా పరిశ్రమ వద్ద ఆటో తిప్పుకొనే సమయంలో గుర్తుతెలియని టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. కుళ్లాయప్పకు భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యూపీ వాసి మృతి

డీ.హీరేహాళ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హుస్సేనాబాద్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ షాజాద్ (43) సోమవారం మరణించాడు. ఇతను నాలుగురోజుల క్రితం బళ్లారి వైపు నుంచి బెంగుళూరు వైపుగా హైవేపై వెళ్తూ ఓబుళాపురం గ్రామ సమీపంలో లారీని ఆపి టీ తాగేందుకు రోడ్డు దాటుసాగాడు. ఆ సమయంలో ఓ బైక్ అతన్ని ఢీకొనడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతన్ని బళ్లారి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు స్థానిక ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి స్థానిక రైల్వే స్టేషన్‌లో కదిరిదేవరపల్లికి వెళ్లేందుకు రైలు ఎక్కుతూ సోమవారం ప్రమాదవశాత్తు రైలు కిందపడ్డాడు. దీంతో అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి 108లో తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిక్‌ప్యాకెటర్ అరెస్ట్

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్లూరురోడ్డులోని పద్మావతి కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన వెంకటేష్ పాల్గొన్నారు. అతని జేబిలోని రూ. ఎనిమిది వేలను వెంగన్న అనే వ్యక్తి చోరీ చేస్తుండగా.. కార్యకర్తలు అతన్ని పట్టుకున్నారు. పోలీసులకు అప్పగించారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

ఇరువురి ఘర్షణ

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీకట్ట వద్ద పండు, అరిఫ్ అనే ఇద్దరు స్నేహితులు డబ్బుల విషయంలో సోమవారం ఘర్షణపడ్డారు. అరిఫ్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మురుగుకాలువలు నిర్మించాలని ధర్నా



అధికారులతో కాలనీవాసుల వాగ్వాదం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మురుగు కాలువ నిర్మించాలని ఆ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. నాలుగు నెలల క్రితం మురుగు కాలువల నిర్మాణం కోసం గుంతలు తవ్వి వదిలేశారని, ఆ కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు ఇళ్ల ముందర నిల్వ ఉంటోందని వాపోయారు. ఆ గుంతల్లో పడి చిన్నారులు గాయపడుతున్నారని, దీనిపై పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌తో ఆ కాలనీవాసులు వాగ్వివాదానికి దిగారు. ఎంఈ ఇంతియాజ్, డీఈ షబానా మాట్లాడుతూ మంగళవారం నుంచి కాలువ నిర్మాణ పనులు మొదలుపెడతామని చెప్పడంతో ఆ కాలనీ వాసులు శాంతించారు.

రూపానాయక్ తండాను అభివృద్ధి చేయండి



కలెక్టర్‌తో బంజారా నాయకులు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని బంజారా సంఘం నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఓ ఆనంద్‌ను సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ తండాను దర్తీ ఆబ జన జాగృతి ఉత్కర్ష అభియాన్ పథకం కింద ఎంపిక చేసి ఏడాది అయినా.. ఇంతవరకూ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలూ చేపట్టలేదన్నారు. ఆ పథకంలో పొందుపరిచిన 22 సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి, గిరిజన అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ తండాను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని, టూరిజం శాఖ ద్వారా కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. ఇందులో బంజారా సంఘం నాయకులు కేశవ్ నాయక్, మారుతి ప్రసాద్, దుర్గా పాల్గొన్నారు.



పార్వతి, సర్పంచ్

● **పంచాయతీ ఆస్తులు కాపాడండి**

అనంతపురం కలెక్టరేట్ : ' పామిడి మం డలం రామగిరి ఎగువతండా గ్రామంలో కొందరు వాటర్ ట్యాంక్ చుట్టూ బండలు వేసి ఆక్రమించుకుంటున్నారు. మరుగుదొడ్డిని సైతం ఆక్రమించారు. దీంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. పంచాయతీ ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోండి ' అని రామగిరి ఎగువతండా సర్పంచ్ పార్వతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జి అందజేశారు.

● **పోలీసులు పట్టించుకోవడం లేదు**

రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన తిప్పారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులకు అర్జీ అందజేశాడు. ఆయన మాట్లాడుతూ.. ' నా సోదరుడు హనుమంతరెడ్డి, వదిన వరలక్ష్మి, వారి కుమారులు గోవిందరెడ్డి, రాఘవేంద్రరెడ్డితో గడ్డి వాముకు వెళ్లే దారి విషయంలో నాకు వివాదం ఉంది. ఆగస్టు 20న వారు నా భార్య మహాలక్ష్మిపై దాడి చేయడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. దీనిపై సీఐ జయనాయక్‌కు ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేశారే తప్పా.. వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలి..' అని అధికారులను కోరినట్లు తెలిపారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.732 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.